

దర్జీల దర్జా మాయం !
పండుగలు వస్తున్నాయంటే దర్జీలకు చేతి నిండా పనే. కానీ పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. 8లో▸



'చిల్లర' దోపిడీ
గ్యాస్ ఏజెన్సీలు, డెలివరీ బాయ్స్ గ్యాస్ డోర్ డెలివరీ పేరిట వంట గ్యాస్ వినియోగదారులను దోపిడీ చేస్తున్నారు. 8లో▸



విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు
ప్రజల జీవన విధానంలో సైన్స్ కీలకంగా మారింది. నిద్ర లేచింది మొదలు పడుకునే దాకా మనిషి జీవితం సైన్స్‌తో ముడిపడింది. 9లో▸

న్యూస్‌రీల్

కుక్కల బెడద తప్పిస్తాం



ఫోన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలో కుక్కల బెడదను తప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల తెలిపారు. సోమవారం నిర్వహించిన డయల్ యు వర్ చైర్‌పర్సన్ కార్యక్రమానికి 20 ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇందులో అత్యధికంగా కుక్కల గురించే ఫిర్యా దులు వచ్చాయన్నారు. ఏడు నెలలుగా జంతు నియంత్రణ కేంద్రంలో కుక్కలకు ఆపరేషన్లు చేయిస్తున్నారని, ఇతర ప్రాంతాల నుంచి కుక్కలు వచ్చినట్లు కొందరు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వాటిని పట్టుకొని ఇబ్బందులు లేకుండా చూస్తా మని పేర్కొన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులు మెరుగుపడినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ డీఎల్‌టీ, ఐటీఐ కళాశాలలో డ్రెస్ మేకింగ్ ట్రేడ్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు భర్తీకి దరఖాస్తు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 27 నుంచి మార్చి 8వ తేదీ లోపు ఐటీఐ కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒకేషనల్ డిగ్రీ ఇన్ ఫ్యాషన్ అండ్ అపీరియల్ టెక్నాలజీ ఫ్రమ్ యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీ తోపాటు ఒక సంవత్సరం అనుభవం ఉండాలని తెలిపారు. లేదా డిప్లమా ఇన్ డ్రెస్ మేకింగ్ ఆర్ గార్మెంట్ ఫ్యాబ్రికేషన్ టెక్నాలజీలో క్వాలిఫికేషన్ సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9441430963లో సంప్రదించాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



నర్సింహస్వామి (ఫైల్)

అనంతగిరి: హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శీను కథనం మేరకు.. పట్టణంలోని సూర్యప్రకాష్ కాలనీ(పోలీసు కాలనీ)కి చెందిన నర్సింహ స్వామి వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలోని డీపీఓ విభాగంలో పనిచేస్తున్నాడు. ఉదయం 6గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. నర్సింహ స్వామి భార్య వృత్తి రీత్యా టీచర్. ఉదయం విధులకు వెళుతూ భర్తకు ఫోన్ చేసింది. కానీ లిఫ్ట్ చేయ లేదు. స్కూల్‌కు వెళ్లిన తరవాత కూడా కాల్ చేసింది. అప్పుడు కూడా ఫోన్ తీయలేదు. ఇదిలా ఉండగా వికారాబాద్ డీటీసీ సెంటర్ సమీపంలోని అడవిలో ఓ వ్యక్తి మృతదేహం చెట్టుకు వేలాడుతుండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మృతుడు హెడ్ కానిస్టేబుల్ నర్సింహ స్వామిగా గుర్తించారు. వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న భార్య అనుసూయ బోరున విలపించింది. కుటుంబ విషయంలో గానీ, ఉద్యోగ విషయంలో గానీ ఎలాంటి సమస్యలు లేవని భార్య తెలిపింది. నర్సింహ స్వామి ఆత్మహత్యకు కారణాలు తెలియడం లేదు. మృతుడి భార్య అనుసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యలపై రాజీలేని పోరాటం

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

మొయినాబాద్: ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు, చందానగర్, మేడిపల్లి, రెడ్డిపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి పీఆర్‌టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని తీసుకొచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఉపాధ్యాయుల ఇతర సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మొయినాబాద్ మండల అధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు రాములు, నాయకులు ప్రతాప్, నరేందర్, వేణుగోపాల్, మాణిక్యం, రాములు, లక్ష్మణ్, భీమ్లా, రవికుమార్, వెంకటయ్య, శ్రీనివాస్, జంగయ్య, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు తీపి కబురు

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం సమస్య తీరనుంది. ఉదయం ఏమీ తినకుండా పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. 34 రోజుల పాటు స్నాక్స్ కోసం నిధులు విడుదల చేసింది. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

- 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం నిధుల విడుదల
- జిల్లాలో 8వేల మందికి లబ్ధి
- ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 3వరకు అమలు



వికారాబాద్ బాలికల పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: పదో తరగతిలో మెరుగైన ఫలితాల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల్లోని హైస్కూళ్లకు వచ్చే విద్యార్థులు, అలాగే సొంత గ్రామంలోని పాఠశాలలకు వచ్చే చిన్నారులు ఉద యం ఏమీ తినకుండా స్టడీ అవర్స్‌కు వస్తున్నారు. పాఠశాలలో మధ్యాహ్నం పెట్టే మధ్యాహ్న భోజనం కోసం ఎదురు చూస్తున్నారు. ఇక సాయంత్రం ఖాళీ కడుపుతోనే ప్రత్యేక తరగతులు వింటున్నారు. అయితే ఇలాంటి పరిస్థితితో మార్పు రావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభు త్వం 35 రోజులకు సరిపడా ప్రణాళికను రూపొందించింది. ఇందులో భాగంగానే అల్పాహారం కోసం ప్రత్యేక నిధులు విడుదల చేసింది.

8,291 మంది విద్యార్థులకు లబ్ధి

జిల్లాలోని 19 మండలాల్లో 183 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 8,291 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వంద శాతం ఫలితాలు సాధించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది పదో తరగతిలో 73శాతం ఉత్తీర్ణత ఉండగా, ఈ సారి మరింత పెంచాలని విద్యాశాఖ అధికారులు యత్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించాలనే సర్కారు నిర్ణయంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక తరగతుల కోసం ఉదయం 8:30 గంటల వచ్చి సాయంత్రం 5:45 గంటల వర కు పాఠశాలల్లోనే ఉండాల్సి రావడంతో అల్పాహారం వారికి ఎంతో ఉపయోగపడుతుందని వారు అంటున్నారు.

రూ. 42,28,410 మంజూరు

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో నవంబర్ 11వ తేదీ నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. అయితే ఇప్పటి వరకు దాతలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సొంత డబ్బులతో విద్యార్థులకు అల్పాహారం సమకూర్చారు. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు కొనసాగనున్నాయి. ఈ లెక్కన విద్యార్థులకు అల్పాహారం నిధులు అందిస్తున్నారు. విద్యాశాఖ క్యాలెండర్ ప్రకారం 34 రోజులు పాఠశాల పనిదినాలు ఉన్నాయి. ఈ పనిదినాలను పరిగణలోకి తీసుకొని ఒక్కో విద్యార్థికి రూ. 15 చొప్పున అల్పాహారం కోసం నిధులు కేటాయించారు. జిల్లాలోని 8,291 మంది విద్యార్థులకు ఒక్క రోజుకు రూ. 15 చొప్పున 34 రోజులకు గాను రూ. 42,28,410 విడుదల చేశారు.

చదువుపై దృష్టి



ప్రత్యేక తరగతుల కోసం ఉదయమే పాఠశాలకు వస్తున్నా. ప్రభుత్వం నిధులు విడుదల చేయక ముందే మా హెచ్‌ఎం చంద్రశేఖర్ సొంత డబ్బులతో స్నాక్స్ ఇస్తున్నారు. అల్పాహారం కోసం నిధులు విడుదల కావడం సంతోషంగా ఉంది.
– సంతోష, పదో తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, మదన్‌పల్లి

అల్పాహారం ఇవ్వడం సంతోషం



పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వమే రెండు పూటలా అల్పాహారం ఇవ్వడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో ఆకలిపై దృష్టి ఉండడం లేదు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు బాగా వింటూ చదువుపై దృష్టి పెడుతున్నాం.
– అభిలాష్, పదో తరగతి,మదన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్

15నుంచే అమలు చేస్తున్నాం



ఫిబ్రవరి 15వ తేదీ నుంచే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాం. ఇందుకోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అల్పాహారం నిధులు ఎస్ఎంసీ ఖాతాల్లో జమ చేస్తాం. అందులో నుంచే ప్రధానోపాధ్యాయులు డ్రా చేసుకొని అల్పాహారం అందించాలి. – రేణుకాదేవి, డీఈఓ, వికారాబాద్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఫిర్యాదులు పరిష్కరించండి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రజావాణిలో ప్రజలు పెట్టుకున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమ వారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగార్‌లతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజ ల ఫిర్యాదులను ఎట్టి పరిస్థితిల్లో పెండింగ్‌లో ఉంచరాదన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 331 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.అంతకుముందు కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులు మీమీ శాఖలపై పూర్తి పట్టు సాధించి, కిందిస్థాయి సిబ్బందితో పను లు పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. 15రోజుల క్రితం చేపట్టిన చర్యల ఫలితంగా పను ల్లో పురోగతి కనిపిస్తోందని, ఇదే తరహాలో అధికారులు టీం వర్క్‌గా పని చేయాలని సూచించారు. రూ. 60కోట్ల అంచనాల వ్యయంతో రూపొందించిన రోడ్ల నిర్మాణ పనులను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం తరఫున అధికారులకు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో సొంత పనులు చేసుకోవాలని, ప్రతి ఉద్యోగీ ఆరోగ్యం కాపాడుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. త్వరలో కలెక్టరేట్‌లో ఉద్యోగులకు యోగా తరగతులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచి భవిష్యత్ ఇవ్వండి

- పిల్లలను దత్తత తీసుకున్న దంపతులకు కలెక్టర్ సూచన

అనంతగిరి: దత్తత తీసుకున్న పిల్లలకు కుటుంబసభ్యులు మంచి భవిష్యత్ ఇవ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. వికారాబాద్‌లోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహ కేరింగ్ వెబ్‌సైట్‌లో పిల్లలు కావాలంటూ వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం వారికి కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పిల్లలను దత్తతు ఇచ్చారు. ఇద్దరు బాబులు, ఒక పాపను వెస్ట్ బెంగాల్, కేరళ రాష్ట్రాలకు చెందిన దంపతులకు దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దత్తత తీసుకున్న పిల్లలను సొంత బిడ్డల్లా చేసుకొని మంచి భవిష్యత్ అందించాలన్నారు. పిల్లలు లేని దంపతులు కేరింగ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పిల్లల్ని దత్తతు తీసుకున్న దంపతులకు కలెక్టర్ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి, బాలరక్ష భవన్ సమన్వయకర్త శ్రీలక్ష్మి, శిశు గృహ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

జియో అటెండెన్స్ రద్దు చేయాల్సిందే



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు, సీఐటీయూ నేతలు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్
- ఆశ వర్కర్లతో కలసి కలెక్టరేట్ వద్ద ధర్నా

అనంతగిరి: ఆశ వర్కర్ల కోసం అందుబాటులోకి తెచ్చిన జియో అటెండెన్స్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆశ వర్కర్లతో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న ఆశలకు అదనపు డబ్బులు ఇవ్వాలన్నారు. కరోనా సమయంలో ప్రకటించిన రూ. 1600 స్పెషల్ అలవెన్స్ నేటికీ అందలేదని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాధవి, నాయకులు మంగమ్మ, స్వరూప, పద్మ, సునీత, శోభ, యాదమ్మ, పద్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ధన్యవాదాలు

అనంతగిరి: ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు జియో అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వడంపై బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన ఆశ కార్యకర్తల సంఘం, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం సభ్యులతో కలిసి కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ సంఘం నాయకులు మంజుల, అనిత, జగదేవి, కౌసల్యా, విజయలక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం మేమే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రహ్లాద్‌రావు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు

కుల్కచర్ల: అధికార బీఆర్‌ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి, నియంతృత్వ పాలన కొనసాగుతోందని, ప్రజలు విసిగిపోయి ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. అధికార పార్టీకి తగిన బుద్ధి చెప్పాలంటే బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలి

- గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



వికారాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు

అనంతగిరి: మెడికల్ పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సోమవారం రాత్రి పలు గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రీతి నాయక్ మృతికి కారణమైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్, గిరిజన ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు పాండు నాయక్, ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ ఆనంద్, పీడబ్ల్యూఓ జిల్లా కార్యదర్శి గీత, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆనంద్, ప్రజా వాయిస్ అధ్యక్షుడు అశోక్, ప్రజాసంఘాల నాయకులు, కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

సక్సెస్ బాటలో 'కంటి వెలుగు'

- 24 పీహెచ్‌సీల పరిధిలో 44 వైద్య శిబిరాలు
- 28 రోజుల్లో 1.56 లక్షల మందికి కంటి పరీక్షలు
- రాష్ట్రంలో మూడో స్థానంలో జిల్లా



తాండూరులో కంటి వైద్యం కోసం వచ్చిన జనం



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాండూరు: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కంటి పరీక్షల్లో రాష్ట్రంలోనే జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, మందులు, కంటి అద్దాలను పంపిణీ చేస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కలెక్టర్ నేతృత్వంలో వైద్యశాఖ అధికారులు కంటి వెలుగు శిబిరాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకుంటున్నారు. 100 రోజుల ప్రణాళికలో 28 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో జనవరి 19న ఈ కార్యక్రమం ప్రారంభమైంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీల్లో 100 రోజుల వ్యవధిలో ప్రజలందరికీ కంటి పరీక్షలు పూర్తి చేయాలి. అయితే ఇప్పటి వరకు 28 రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల్లో జిల్లా వ్యాప్తంగా 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 44 వైద్య బృందాలను ఏర్పాటు చేసి 1,56,245 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దగ్గరి చూపు లోపం ఉన్న వారు 26,401 మందిగా గుర్తించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. దూరదృష్టి లోపం ఉన్న వారు 18,961 మందిని గుర్తించి 3,690 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. మిగిలిన వారికి అద్దాలు ఇవ్వాల్సి ఉంది. 1,10,883 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని తేలింది. మరో 78 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. గ్రామాల్లో కంటి వెలుగు శిబిరం నిర్వహించిన సమయంలో అందుబాటులో లేని వారి కోసం ఇతర గ్రామాల్లో జరిగే శిబిరాల్లో పరీక్షలు చేయించుకునే వెసులుబాటు కల్పించారు.

శస్త్రచికిత్సలకు నో ఛాన్స్

ఈ కార్యక్రమంలో కంటి ఆపరేషన్లకు సంబంధించి ఎలాంటి పరీక్షలు చేయడం లేదు. కేవలం దగ్గరి, దూరం చూపు లోపం ఉన్న వారినే గుర్తిస్తున్నారు. కంటి ఆపరేషన్లకు గాను వికారాబాద్‌లోని కంటి ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు.

స్పందన బాగుంది



జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. కంటి పరీక్షల్లో జిల్లా మూడో స్థానంలో నిలిచింది. ఒకే రోజు 44 వైద్య బృందాలు 44 గ్రామాల్లో కంటి పరీక్షలు చేస్తున్నారు. ఒక్కో బృందం రోజుకు 100 మందికి పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాం. 28 రోజుల వ్యవధిలో 1.56లక్షల మందికి కంటి పరీక్షలు చేశాం.

– స్వామినాథన్, ప్రోగ్రాం ఆఫీసర్, వికారాబాద్ జిల్లా

క్లుప్తంగా

కేంద్ర నిధులతోనే రాష్ట్రాభివృద్ధి

కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటయ్య



మాట్లాడుతున్న వెంకటయ్య

దౌల్తాబాద్: కేంద్రం ఇస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కూర వెంకటయ్య అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ మరిచారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్, నియోజకవర్గ కన్వీనర్ నర్సింలు పాల్గొన్నారు.

పార్క్ చేసిన బైక్ దగ్ధం



మంటల్లో దగ్ధమైన బుల్లెట్

తాండూరు టౌన్: ఇంటి ఎదుట పార్క్ చేసిన బుల్లెట్ బైకు దగ్ధమైన ఘటన తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన డాక్టర్ రాకేశ్ ఆదివారం రాత్రి ఇంటి ఎదుట తన బైక్ పార్క్ చేశాడు. కాసేపటికి వచ్చి చూసే సరికి మంటల్లో బైకు కాలిపోతోంది. స్థానికులు మంటలార్పేందుకు యత్నించినా అప్పటికే బైక్ చాలా వరకు కాలిపోయింది. ఈ ఘటనపై డాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లి వచ్చే లోగా..

- ఇల్లు గుల్ల
- మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నగదు చోరీ

ధారూరు: ఓ కుటుంబం దైవదర్శనానికి వెళ్లివచ్చేలోగా గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ధారూరు గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ అప్పయ్య తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దుబ్బ మల్లేశం ఈనెల 22న కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వేంకటేశ్వరుడి దర్శనానికి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో వారు తిరిగిరాగా.. ఇంటికి వేసిన తాళం బ్లేడుతో కోసి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం పగులగొట్టి అందులో 3తులాల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు గమనించారు. వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పాత నేరస్తుల జాబితా తిరిగేసి ఓ దొంగను విచారించినట్లు సమాచారం. అతను గతంలో పలు దొంగతనాల కేసుల్లో ప్రధాన నిందితుడని పోలీసులు భావిస్తున్నారు.

మంటలంటుకొని బాలిక మృతి

తలకొండపల్లి: ప్రమాదవశాత్తు సిలిండర్ మంటలంటుకొని తీవ్రంగా గాయపడిన ఓ బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామానికి చెందిన వడ్డెమోని యాదమ్మ కూతురు ఐశ్వర్య (9) ఈ నెల 22న గట్టు ఇప్పలపల్లికి చెందిన తన పెద్దనాన్న మల్లేశ్ ఇంటికి వెళ్లింది. అదేరోజు మల్లేశ్ కుటుంబ సభ్యులు పొలం పనుల నిమిత్తం వెళ్లగా.. ఐశ్వర్య మాత్రం ఇంట్లోనే ఉంది. ఉదయం 11 గంటల ప్రాంతంలో మ్యాగి వండుకుందామని ఐశ్వర్య సిలిండర్ వెలిగించింది. ప్రమాదవశాత్తు మంటలు ఐశ్వర్య దుస్తులకు అంటుకున్నాయి. మంటలు తాళలేక ఐశ్వర్య బయటికి పరుగులు తీసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆరు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఐశ్వర్య మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

దర్జీల దర్జా మాయం

పండగొస్తున్నది అంటే వారికి భోజన విరామం దొరకని పరిస్థితి, పోటీ పడి మరీ టైలర్ షాపుల వెంట జనాలు తిరిగే కళాత్మక టైలరింగ్ వ్యవస్థ నేడు కుదేలయింది. రెడీమేడ్ వస్త్రవ్యాపార వ్యవస్థ తన పరిధిని విస్తృతం చేసుకోవడంతో టైలరింగ్ కొందరికి మాత్రమే పరిమితమైంది. నేడు వరల్డ్ టైలర్స్ డే ను పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

- కొందరికే పరిమితమైన టైలరింగ్
- రెడీమేడ్ వస్త్ర వ్యాపారంతో తగ్గిన గిరాకీ
- నేడు వరల్డ్ టైలర్స్ డే

కుల్కచర్ల: సాంప్రదాయక పండగలు వస్తున్నాయి అంటే బట్టల దుకాణానికి వెళ్ళివచ్చి మరుసటిరోజే వాటిని దర్జీలకు(టైలర్)లకు కుట్టడానికి ఇచ్చేవారు. నాడు ప్రత్యేక కొలతలతో రెడీమేడ్ వస్త్రాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు టైలర్ వద్దనే కుట్టించుకునేవారు. బట్టలు కుట్టాలంటే సుమారు ఒక నెలరోజుల ముందే కొలతలు ఇచ్చి ఫలాన తేది వరకు కావాలని చెప్పేవారు. కానీ నేడు వస్త్రవ్యాపార రంగంలో రెడీమేడ్ వ్యాపారం చొచ్చుకు రావడంతో సాంప్రదాయక కుట్టుమిషన్ల వ్యవస్థ నీరుగారే పరిస్థితికి వచ్చింది. ఎంతోమందికి ఉపాధినిచ్చే కుట్టుమిషన్ల వ్యవస్థ కొందరికే పరిమితమై ఇబ్బందికరంగా సాగుతోంది.

టైలర్‌లకు తగ్గిన గిరాకీ

వివిధ రకాలైన కొలతలతో విస్తృతమైన మార్కెటింగ్ వ్యవస్థతో రెడీమేడ్ బట్టల వ్యాపారం పల్లెల్లోకి రావడంతో ప్రజలు ఎక్కువగా రెడీమేడ్ వైపే మక్కువ చూపుతున్నారు. త్వరితగతిన కుట్టిన బట్టలు దొరకడం, వివిధ మాడల్స్ అందుబాటులో ఉండటం, జీన్స్ వంటి కొత్తదనం చూపించే బట్టలు అందుబాటులోకి రావడంతో సాంప్రదాయక కుట్టు విధానంపై ప్రజలు మొగ్గు చూపడం లేదు. సాంప్రదాయక కుట్టుకు పెట్టే ఖర్చు కంటే రెడీమేడ్ బట్టలు తక్కువగా వస్తుండటంతో ప్రజలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రెడీమేడ్ వైపు మొగ్గుచూపుతున్నారు.



అలవాటు పడిన వారు మాత్రమే..

రెడీమేడ్ వస్త్ర వ్యాపార వ్యవస్థ వృద్ధితో కుదేలైన టైలరింగ్ వ్యవస్థ కొందరికే పరిమితమైంది. సీనియర్ సిటిజన్స్, ప్రత్యేక కొలతలు అవసరమైన వ్యక్తులు, సాంప్రదాయక కుట్టుకు అలవాటైన కొందరు కుట్టువిధానం ద్వారానే బట్టలను కుట్టించుకుంటున్నారు. సాంప్రధాయక కుట్టు విధానం కొందరికే పరిమితమైనప్పటికీ కొంత ప్రత్యేక హోదా ఉన్న వ్యక్తులు సాంప్రదాయ కుట్టు విధానం ద్వారానే నేటికీ బట్టలను కుట్టించుకుంటున్నారు.

వన్నె తగ్గని లేడీస్ టైలరింగ్

సాంప్రదాయక కుట్టు విధానం మగవారిలో కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ స్త్రీల వస్త్ర వ్యవస్థలో మాత్రం కొత్త హంగులతో నూతనోత్తేజంతో టైలరింగ్ కొనసాగుతున్నది. అమ్మాయిల అంశంలో కొత్త మాడలింగ్‌లో వస్త్రాల అలంకరణలో కుట్టు విధానం ద్వారానే వాటిని కుట్టాల్సి ఉండటంతో లేడీస్ టైలరింగ్ వ్యవస్థ జోరుగా సాగుతోంది. నిరుపేదలకు ఉపాధిగా నిలుస్తున్న సాంప్రదాయక కుట్టు విధానాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించి టైలరింగ్‌నే వృత్తిగా జీవనాన్ని ఎంచుకున్న వారికి ప్రత్యేక ప్రోత్సహకాలు అందించాలని కోరుతున్నారు.

ముప్పై ఏళ్లుగా



ముప్పై సంవత్సరాలుగా టైలర్‌గానే జీవితాన్ని గడుపుతున్నా. టైలరింగ్ ద్వార ఆస్తుల కంటే ప్రజల ప్రేమాభిమానాలను సంపాదించా. బట్టలు కుట్టుకోవడానికి నాడు ఎక్కువగా వచ్చేవారు నేడు తగ్గింది. కుట్టువిధానానికి ఉండే గౌరవం మాత్రం పెరిగింది.

– ఖాజా పాష, టైలర్, చౌడాపూర్

ప్రభుత్వం ప్రోత్సహించాలి



టైలరింగ్ ఒక వృత్తిగా చేసుకుని జీవనాన్ని గడుపుతున్నా. గ్రామస్తులు ఎక్కువగా నా దగ్గరనే కుట్టించుకుంటారు. ప్రస్తుత పరిస్థితులలోనూ సాంప్రదాయక కుట్టువిధానాన్ని ప్రజలు ఇష్టపడడం సంతోషంగా ఉంది. ప్రభుత్వాలు మరింత ప్రాత్సహాకాన్ని అందిస్తే తమ జీవితాలు మరింత ఉన్నతంగా నిలిచే అవకాశం ఉంది.

– సర్వర్, టైలర్, పుట్టపహాడ్

పాపం పార్వతమ్మ

- ప్రసూతి కోసం వస్తే చేతివేళ్ల స్పర్శ కోల్పోయిన వైనం
- ఎంసీహెచ్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- వైద్య సిబ్బందిపై సూపరింటెండెంట్‌కు కుటుంబీకుల ఫిర్యాదు



స్పర్శ కోల్పోయిన కుడి చేతిని చూపుతున్న బాధితురాలు పార్వతమ్మ

తాండూరు టౌన్: ప్రసూతి కోసం తాండూరు మాతా శిశు ఆస్పత్రికి వచ్చిన ఓ గర్భిణి చేతి వేళ్ల స్పర్శ కోల్పోయింది. కాన్పు తర్వాత డిశ్చార్జి అయినా వేళ్లకు స్పర్శ తిరిగి రాలేదు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించినా ఫలితం రాలేదు. దీంతో బాధ్యులైన ఆస్పత్రి సిబ్బందిపై ఆమె కుటుంబీకులు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లికి చెందిన శ్రీనివాస్‌కు కోస్గి మండలం కడంపల్లికి చెందిన పార్వతమ్మతో వివాహమైంది. పార్వతమ్మ గర్భం దాల్చడంతో ప్రసవం కోసం జనవరి 17న తాండూరులోని మాతా శిశు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆరోజు మధ్యాహ్నమే మగ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆమె కుడి అరచేతి, వేళ్ల స్పర్శ కోల్పోయాయి. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అయినా తగ్గక పోవడంతో మహబూబ్‌నగర్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా మార్పు రాలేదు. ప్రసవం అయిన మరుసటి రోజు నుంచి చేయి స్పర్శ కోల్పోయినందున, తాండూరు మాతా శిశు ఆసుపత్రి సిబ్బంది ఇంజక్షన్ ఇచ్చిన తర్వాతే ఇలా జరిగిందని ఆరోపిస్తూ సంబంధీకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

రెండు బైకులు ఢీ..

వ్యక్తి మృతి

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని ద్యాచారం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ధారూర్ మండలం మోమిన్‌కలాన్‌కు చెందిన మేస్త్రీ యాదయ్య, కుర్వ మల్లేశం బైకులపై ఎదురెదురుగా ప్రయాణిస్తున్నారు. సాయిబాబా ఆలయ సమీపంలో ఒక్కసారిగా వారి బైక్‌లు ఢీ కొట్టుకోవడంతో యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశంకు తీవ్ర గాయాలవ్వగా ఆయన్ను వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి


డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు ఆయన రూ.లక్ష విరాళంగా అందజేశారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు భక్తి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాబయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

'ఉర్సు' మత సామరస్యానికి ప్రతీక

దోమ: ఉర్సు ఉత్సవాలు మత సామరస్యతకు ప్రతీకగా నిలుస్తాయని ఉమ్మడి డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో యాపీర్ సయ్యది ఉర్సు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు నిర్వహకుడు సిరాజుద్దీన్ దర్గాలో ఖతం పురాణం, ఖవ్వాలీ దీపారాధన కార్యక్రమాలను జరిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు, పరిగి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాబయ్య, బీఆర్‌ఎస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, షోహెబ్, నర్సిరెడ్డి, ముద్దం పవన్ యాదవ్, నరేశ్ యాదవ్, శ్రీనివాస్, శాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కాని లేని నావ



కొడంగల్ నియోజకవర్గ మ్యాప్

టీడీపీకి నాయకుడు ఎక్కడ?

- అభిమానం ఉన్నా ఆదరణ లేదు
- క్యాడర్‌కు భరోసా కరువు

కొడంగల్: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి అధిక సంఖ్యలో అభిమానులు ఉన్నారు. అయితే ఆదరించే నాయకులు లేరు. క్యాడర్‌కు భరోసా కరువైంది. ఒకప్పుడు కొడంగల్‌లో టీడీపీ బలంగా ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో తెలంగాణ సెంటిమెంట్.. కేసీఆర్ హవా ఉన్న సమయంలోనూ కొడంగల్‌లో టీడీపీ అభ్యర్థి రేవంత్‌రెడ్డి గెలిచారు. అంత ప్రజాదరణ ఉన్న నియోజకవర్గంలో ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. 1985, 1994లో నందారం వెంకటయ్య ఆయన మరణం తర్వాత తనయుడు నందారం సూర్యనారాయణ 1996 ఉప ఎన్నికలో విజయం సాధించారు. రేవంత్‌రెడ్డి 2009, 2014లో గెలిచారు. ఐదుసార్లు టీడీపీ అభ్యర్థులు కొడంగల్ నుంచి విజయం సాధించారు.

కాంగ్రెస్, టీడీపీ మధ్యనే ప్రధాన పోటీ

కొడంగల్ నియోజకవర్గం ఏర్పడిన 70 ఏళ్లలో 15 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో కాంగ్రెస్ పార్టీ 6 సార్లు, టీడీపీ 5 సార్లు, స్వతంత్ర అభ్యర్థులు మూడు సార్లు, టీఆర్‌ఎస్ ఒకసారి గెలుపొందారు. కర్నాటక సరిహద్దులో ఉన్న ఈ నియోజకవర్గం మొదటి నుంచి కాంగ్రెస్‌కు అండగా ఉంది. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలోనూ ఇక్కడ కాంగ్రెస్ విజయం సాధించింది. రాష్ట్రం ఏర్పడిన తొలి ఎన్నికలో టీడీపీ అభ్యర్థి రేవంత్ రెడ్డిలో గెలిచారు. మొదటి నుంచి నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీ మధ్యనే పోటీ నెలకొనేది. అయితే 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అధిష్టానం కొడంగల్‌లో ఎలాగైన గెలిచి తీరాలనే ఉద్దేశంతో ప్రత్యేక దృష్టి పెట్టింది. పట్టుదలతో అనుకున్నది సాధించి కొడంగల్‌లో టీఆర్‌ఎస్ జెండా ఎగిరేలా చేసింది.

కొడంగల్ శాసనసభ్యులు

1957లో నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా అచ్చుతారెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచారు. 1962లో రుక్మారెడ్డి, 1967లో అచ్చుతారెడ్డి, 1972లో నందారం వెంకటయ్య, 1978లో గురునాథ్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించారు. 1983లో గురునాథ్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. 1985, 1994లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నందారం వెంకటయ్య గెలుపొందారు. ఎమ్మెల్యేగా ఉంటూనే నందారం వెంకటయ్య మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. 1996లో జరిగిన ఉపఎన్నికలో టీడీపీ నుంచి దివంగత నందారం వెంకటయ్య రెండో కుమారుడు నందారం సూర్యనారాయణ గెలిచారు. 1999, 2004లో గురునాథ్‌రెడ్డి విజయం సాధించారు. 2009, 2014లో టీడీపీ అభ్యర్థి రేవంత్‌రెడ్డి గెలిచారు. 2018లో టీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పటికీ కొంతమంది కార్యకర్తలు టీడీపీలో ఉంటూ జీవం పోస్తున్నారు. కొడంగల్‌లో తలారీ శేఖర్, జంగం శాంతకుమార్, రహీం, కోస్గిలో కుమ్మరి అంజిలయ్య, డీకే రాములు, దౌల్తాబాద్‌లో ఒలిగిరి నారాయణ, మాణిక్యప్ప, బిచ్చిరెడ్డి, బొంరాస్‌పేట మండలంలో బాలకిషోర్, శ్రీశైలం, రమేశ్, సాయిలు, రాములు, మద్దూరులో శ్రీనివాస్ తదితరులు పార్టీ కోసం పనిచేస్తున్నారు.

సామాజిక సేవలకు ఉత్తమ అవార్డు

పూడూరు: సామాజిక సేవలకు గాను పూడూరు మండలం మన్నెగూడకు చెందిన ఆదిల్ గ్రూప్ చైర్మన్, ఎంపీటీసీ సభ్యుడు మస్రత్ ఆదిల్ జాతీయ స్థాయి బెస్ట్ సర్వీస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం అవార్డు సెలక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ ఆహ్వాన పత్రికను అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో విశేష సేవలు అందించినందుకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారని చెప్పారు. కరోనా సమయంలోనూ పేదలకు నిత్యావసర సరుకులు , వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారని చెప్పారు. ఉత్తమ సేవలు చేసేవారికి బహుజన సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం అవార్డులు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. మార్చి 12న తిరుపతిలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు.



ఆహ్వాన పత్రిక అందుకుంటున్న మస్రత్ ఆదిల్

ప్రభుత్వ భూమిని కాపాడండి

అనంతగిరి: మండల పరిధిలోని రంగాపూర్‌లో సర్వే నంబర్ 18లో ఉన్న 9.39ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణకు గురవుతోందని వైఎస్సార్ టీపీ పరిగి కోఆర్డినేటర్ కోళ్ల యాదయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఆ భూమిని కాడాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రియల్ వ్యాపారులు ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఇట్టి భూమిని నిరుపేదలకు పంచాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు వసంత్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

మైనర్ వివాహంపై చైల్డ్‌లైన్‌కు ఫిర్యాదు

కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లి నిలిపిన తహసీల్దార్



తహసీల్దార్‌కు అంగీకార పత్రం అందేస్తున్న బాలుడి కుటుంబ సభ్యులు

ధారూరు: మైనర్ వివాహం చేస్తున్నట్లు చైల్డ్ లైన్ ఫిర్యాదు అందడంతో తహసీల్దార్ అడ్డుకున్నారు. ఈ ఘటన సోమవారం మండల పరిధిలోని దోర్నాల్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లాలప్ప, భీమమ్మల కుమారుడికి, పెద్దేముల్ మండలంలోని రేగొండి గ్రామానికి చెందిన వెంకటమ్మ, వెంకటయ్యల కూతురుతో మార్చి 5న వివాహం జరిపించేందుకు నిశ్చయించారు. ఇద్దరూ మైనర్లే. ఇరు కుటుంబాలు పెళ్లి పనుల్లో ఉన్నారు. ఈ విషయం గుర్తు తెలియని వ్యక్తి 1098కు సమాచారం ఇచ్చారు. వెంటనే చైల్డ్‌లైన్ ప్రతినిధి సంజమ్మ సోమవారం తహసీల్దార్ భువనేశ్వర్‌కు మైనర్ల వివాహ విషయం వివరించింది. దీంతో ఆయన దోర్నాల్ గ్రామంలో బాలుడి కుటుంబానికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వివాహ వయస్సు వచ్చే వరకు పెళ్లి చేయమని అంగీకారపత్రం రాసి ఇచ్చారు.

దివ్యాంగుల రిజర్వేషన్ల సాధనకు పోరాటం

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి

షాద్‌నగర్: నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి అన్నారు. ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నామినేటెడ్ పదవుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏళ్లు గడుస్తున్నా దివ్యాంగుల సంక్షేమానికి ఏ ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం దివ్యాంగులు ఐక్య ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మానసిక దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలని, రైల్వేలో మరిన్ని సౌకర్యాలు పెంచాలని, ప్రభుత్వం రంగంలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాంచేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా దివ్యాంగుల పెన్షన్‌ను రూ.10వేలకు పెంచాలని కోరారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లోనూ దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి రాజశేఖర్‌గౌడ్, వేముల కుసుమ, దర్శనం శంకర్, ఖాజా, శ్రావణ్, మహేశ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న భుజంగరెడ్డి

డోర్ డెలివరీ పేరిట 'చిల్లర' దోపిడీ

జిల్లా వ్యాప్తంగా మొత్తం 18 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా 3 లక్షలకు పైగా కనెక్షన్లు ఉన్నాయి. ఏజెన్సీ నుంచి ఐదు కిలో మీటర్లలోపు గ్యాస్ సిలిండర్లు ఉచితంగాసరఫరా చేయాలనే నిబంధనలున్నా.. ఏజెన్సీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డోర్‌డెలివరీ పేరుతో రూ.20 నుంచి రూ.50వరకు వసూలు చేస్తున్నారు. అడిగేవారు లేక పోవడంతో ఈ అక్రమ దందా జోరుగా సాగుతోంది.

- రూ.30 నుంచి రూ.50 వరకు అక్రమంగా వసూలు
- పట్టించుకోని అధికారులు
- నష్టపోతున్న వినియోగదారులు



నవాబుపేట: గ్యాస్ ఏజెన్సీలు, డెలివరీ బాయ్స్ గ్యాస్ డోర్ డెలివరీ పేరిట వంట గ్యాస్ వినియోగదారులను దోపిడి చేస్తున్నారు. ఒక్కో సిలిండర్‌పై రూ.30 నుంచి రూ.50వరకు వసూలు చేస్తుండడంతో ప్రతీ నెల లక్షల్లో అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఎప్పటి నుం కొనసాగుతున్నా పౌరసఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఐదు కిలోమీటర్ల వరకు ఉచిత డెలివరీ

గ్యాస్ సిలిండర్లకు అదనంగా వసూలు చేయవద్దని.. బిల్లులపై ఉన్న ధరకు అదనంగా చెల్లించవద్దని ఏజెన్సీ ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఐదు కిలోమీటర్లలోపు ఉచిత సరఫరా, 5 నుంచి 30కిలో మీటర్ల మేర రూ.10, అంతకు మించితే రూ.20 వసూలు చేయాలని నిబంధనలున్నాయి. సిలిండర్ డెలివరీ సమయంలో బండను తూకం వేసి లీకేజీ లేకుండా ఇవ్వాలి. కానీ ఈ నిబంధనలు జిల్లా పరిధిలో ఎక్కడ అమలవుతున్న దాఖలాలే లేవు.

రవణా చార్జీలు చెల్లిస్తున్న కంపెనీలు

గ్యాస్ గోదాం నుంచి వినియోగదారుడి ఇంటి వరకు సిలిండర్‌ను చేర్చి, ఖాళీ సిలిండర్‌ను గోదాంలో చేర్చేందుకు ప్రతీ ఏజెన్సీకి సదరు కంపెనీలు రవాణా చార్జీలు చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని సిబ్బందికి ఇచ్చి ఎమ్మార్పీ ధరలకే సిలిండర్లను సరఫరా చేయాల్సిన భాద్యత ఏజెన్సీలదే. అయితే కంపెనీలు ఇచ్చే రవాణా చార్జీలను ఏజెన్సీలు వాడుకుంటున్నాయనే ఆరోపనలు వస్తున్నాయి. వారు తమకు జీతాలు ఇవ్వకుండా వినియోగదారుల ఉంచే వసూలు చేసుకోవాలంటున్నారని కొంత మంది సిబ్బంది ఆరోపిస్తున్నారు. కొన్ని ఏజెన్సీలు, డెలివరీ బాయ్స్ సంయుక్తంగా వినియోగదారుడి జేబుకు చిల్లు పెడుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

ఏజెన్సీల కనుసన్నల్లోనే డెలివరీ బాయ్స్ వసూళ్లు..

గోదాం నుంచి వినియోగాదారుడి ఇంటికి కిలోమీటర్ దూరం ఉన్నా రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు పలువురు వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నారు. 10 కిలో మీటర్లు మించితే రూ.50 వరకు వసూలు చేస్తున్నారంటున్నారు. ఏజెన్సీల నిర్వహకులు, డెలివరీ బాయ్స్ కలిసి సామాన్యులను దోచుకుంటున్నా అధికారులు అటుగా కన్నెత్తి చూడడం లేదని వినియోగదారులుమండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులుస్పందించి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



గ్యాస్ సిలిండర్ పంపిణీ ఉచితం. ఎవరైనా నిబంధనలకు మించి వసూలు చేస్తే వెంటనే ఫిర్యాదు చేయండి. వెంటనే ఆ ఏజెన్సీపై చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేస్తాం.

– రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రెవెన్యూ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మాకు రావాల్సిన భూ పరిహారం ఇవ్వకుండా మమ్మల్ని రోడ్డుపాలు చేసిన రెవెన్యూఅధికారులు, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు బాధితుడు ఐలేష్ ఫిర్యాదు చేశాడు. ఇబ్రహీంపట్నం సర్వే నెంబరు 58లో ఐదెకరాల భూమికి పరిహారం ఇవ్వకుండా మమ్మల్ని తప్పుదోవపట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పట్లో ఉన్న ఆర్డీఓ రాజేందర్, భూదాన్ బోర్డు చైర్మన్ రాజేందర్‌రెడ్డి, రాంరెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం చేస్తామని అనేక మార్లు ప్రభుత్వ అధికారులు హామీలు ఇచ్చి పట్టించుకోవడం లేదని వాపోయారు. మాకు అనుకూలంగా రిపోర్టు పంపుతామని చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. నావద్ద అన్ని పత్రాలు తీసుకుని దళారులకు కట్టబెట్టారని, అక్రమంగా కొంత మంది పట్టాలను తయారు చేసుకుని పరిహారం కొట్టేశారన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి పరిహారం ఇప్పించాలని కోరారు. లేదంటే మా కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని.. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నాడు.